దృష్టిభేదం

పెద్దపార్కు. రకరకాల ప్రజలు గుంపులు పడి అక్కడి ప్రకృతి సౌందర్యాన్ని ధ్వంసంచేశారు. నిశ్శబ్దంగా, ఆకాశపు నీలాన్ని, రంగులమబ్బుల్ని, పక్షుల సంతోషరవాలను అనుభవించలేక, ఎదుటివాళ్ళు అనుభవించకుండా గూడా జాగ్రత్త తీసుకొంటున్నారు; నవీనభారత సౌందర్యారాధకులు, వీరులు.

పార్కులో ప్రతిమిల్లిమీటరు ప్రదేశంలోని అందమూ అదివరకే మురికిచేయబడటంచేత, సుందరం తన పాతస్నేహితులను చాలామూలకు గన్నేరు గుబుర్లమధ్యకు తీసుకువెళ్ళాడు. అతను మొన్ననే యీవూరువొచ్చాడు—పట్నంలోని తన పెద్ద వుద్యోగానికి తాత్కాలికంగా శెలవుబెట్టి తన పాతప్రియురాలు "శశి"కోసం. అందరికీ తెలుసు యీసంగతి. వొక్కరూ అనరు పైకి; సుందరంగూడా చివరికి. మిత్రుల్ని చూట్టానికి వొచ్చాట్ట. మరింకగతిలేదు అతనికి అబద్ధం ఆడటంతప్ప. కార్యక్రమమంతా తృప్తిపడ్డా జరుపుకొంటూ, 'అక్కయ్య'-'పిన్ని' 'చెల్లెలు' అంటూ పైకి దొంగకూతలు కూస్తుంటే చాలు. అక్కడికి సంతృప్తిపడటం జరుగుతుంది యీమాటలు వాళ్ళ మనసుల్ని కంట్రోల్ చేస్తున్నాయా? అవయవాలు పనిచెయ్యకుండా ఆపుతున్నాయా? జవాబులేదు యీ ప్రశ్నలకు—

సుందరం 'గొప్పవుద్యోగం చేస్తుంటేనేం? అతనిలో శృంగారపు sense ఇంకా చావలేదు. అసలు ఆ వుద్యోగం

చెయ్యటం మిసెస్. డాక్ కోసమని కొంతమంది అంటారు. అతను మాత్రం 'డాక్' నాకు తెలుసు. చాలా అందమైన 'ఛాప్' అంటాడు నవ్వి.

అతని జీవితం శృంగారపరంగా అద్భుతంగా వెలిగింది. గత జీవితచరిత్రపుటధ్యాయాలను చెబుతుంటే, శ్రోతలు మైమరచిపోతారు—ఎంకి పాటలను వింటున్నట్టు. కృష్ణశాస్త్రి 'ఊర్వశి' చదువుతున్నట్లు. నిజంగా ఆ అనుభవాలే అంత శృంగార పుంఖితమో, లేక అతను చెప్పేపద్ధతే గొప్పదో!

సంభాషణ చాలా నీరసంగా ప్రారంభమయింది, ఏదో ఫౌంటెన్ పెన్ మీద. ప్రారంభించింది రంగడు.

"ఇది చాలాగొప్ప కలం"

"అవును. అద్భుతంగా రాస్తుంది"

"అందమయిన పాళీ, చక్కని క్లిప్. ఎంతకొన్నావురా సుబ్బులూ?"

"వీడు కొంటాడా? ఎక్కడో కొట్టేసివుంటాడు; ఇంత మంచికల ..."

"నోరుమ్మయ్ రా ఘుణియా. మార్తాండం ఫౌన్సీషాపులో ఇరవై నాలుగుంబేడా...వోరేయ్ ఆ బుద్ధి...ఏదీ...కొట్టేయ్యటం...నా వెంటతిరిగే వారికిగూడా లేదోయ్...అనుకున్నావేమో?"

"ఎందుకోయ్ అంతకోపం? పూరికేనేలంటే వాడూ?",

"కోపంరాదా? అందమైన భార్యను తెచ్చుకొంటే' 'ఇదెవరు? నీకేమవుతుంది? ఎక్కడ కొట్టుకొచ్చావ్? అసలు దీని మొదటి మొగుడెవరు? మాగ్గూడా యేమన్నా ఛాన్సు యిప్పి

స్తావా?' అంటే కోపంరాదా ఎవరికన్నా" అన్నాడు పెన్న యజమాని.

'ఆపండిరా వెధవాయలూ! ఎప్పుడూ వాళ్ళ కేరొద. పతివ్రతలకు నిలయమైన భారత దేశంలో, ముఖ్యంగా తెలుగు నాడులో, కాస్త జాగ్రత్తగా, రహస్యంగా పరిశోధిస్తే ఆడవాళ్ళు కొకొల్లలు.' అన్నాడు పాండు.

'పోతాను' సుందరం లేచాడు.

"ఏం?"

'అప్పుడే?'

'నీకోసమని కాదుటోయ్ ఇప్పుడు పార్కు కొచ్చింది నేను. లేకపోతే, ఆ నరసమ్మ నాకు చేదయ్యా?" అన్నాడు కేశవరావు.

"ఇదా? ఇదిట్రా నాకోసం రావటం. బతుకు మొత్తం, కేకలు, రొదలు, కాగితాలు, అంకెలు, అనుమానాలు అయితే ఏం చావరాదూ..."

"నీళ్లులేని బావిలోదూకి" అని పూర్తి చేశాడు వొకడు.

"తగాదాలు వద్దు., సుందరం తెలిసినవాడు మనకంటే. ఒరేయ్ ఈకలం ఎంతవుతుందో ఖరీదుచెప్పు ఖచ్చితంగా. పట్నంలో వున్నవాడివి. బాగావిలువలు కట్టొచ్చు."

'నాకు తెలీదు'

"చూడరా అసలు"

"వొరేయ్! ఆడవాళ్ళకు విలువ కట్టడంతప్ప సుందరం గాడికి మరింకేమీ తెలీదురా!"

అందరూ గొల్లుమన్నారు.

'అదీ సరిగ్గా నాకు తెలీదు. ఒకసారి అందులోగూడా శ్రీవారు పప్పులో కాలేశారు'' అన్నాడు సుందరం.

"హా. హతవిధి! సప్తసముద్రము లింకనూ..."

"కాదోయ్! ఇప్పటికి ఐదుసముద్రాలే కనిపెట్టారు"

'పోనివ్వు...ఆఁ...పంచసముద్రము లింకలేదా? ఆకాశంబు బ్రద్దలుకాలేదా?...'

'మళ్ళీ వోస్తా...' అని సుందరం లేచాడు. అప్పటికి చీకటి పడింది. విద్యుద్దీపాలు విధవల ముఖాల్లాగా వెలుగుతున్నాయి. ఇంకా జనం రొద.

"నిన్ను పోనిస్తానుటోయ్, కంఠంలో వూపిరివుండగా. ఆ వెళ్ళబెట్టే దేమిటో పూర్తిగా బైటికికక్కు, లేదా...?"

'ఏమిటి కక్కటం?' అని ఆశ్చర్యపడ్డాడు సుందరం.

'అదే, నువ్వెక్కడ ఆడవాళ్ళకు విలవ కట్టలేక పొయ్యావో...'

"ఊఁ, పోనివ్వండిరా...అబ్బబ్బా. వొక్క నిమిషం వూపిరి తిరగనియ్యరు...చూడండిరా తగ్గిపోతున్న ఎండ బరువుకు కదలలేక, కోపంతో ఎర్రబడ్డ ముఖాల మబ్బులు..."

"ఛస్. కవిత్వంవొద్దు. కబుర్లు. నువ్వు బోల్తాపడిన కబుర్లు కావాలి. మేము గర్వించే నువ్వు, పరాజయం పొందటం విని సంతోషిస్తాం" అన్నాడు కేశవులు.

'ఇక తప్పదా?' అన్నట్టు అందరి వేపూ చూసి "ఒకసారి ..."అన్నాడు సుందరం.

'ఎప్పుడు?''

'తంతారోయ్ ...''

'హాత్తోస్మి! ఒకసారి...ఊఁ'

'చాలా రోజులైంది. అప్పుడు మనకింత అనుభవం ఎక్కడేడిచిందీ! నెల్లూరులో దిగాను."

"ఎందుకురా నెల్లూరులో దిగటం?"

"భగవాన్!"

అన్నాడు సుందరం తలపట్టుకొని.

'పోండిరా వెధవలూ' అని రంగడు వాణ్ని కసిరి "నెల్లూరులో దిగావు. తరవాత?"

'దిగాను, గోవిందాయ్‌ని పిలవటంకోసం. అప్పుడు వాడేదో పత్రికలో వుద్యోగం వెలగబెడుతున్నాడుగా. వాళ్ళ నాన్నకు వాడినిగురించి వొకటే దిగులు.'

'మానాన్నకూ నన్నుగురించీ దిగులే! ఇకముందు నే నెట్లా బతుకుతానా అని" కేశవులు గొణిగాడు.

'ఎక్స్‌ప్రెస్ ఎన్నింటికి?' అన్నాడు సుందరం లేస్తో.

అందరూకలిసి సుందరాన్ని బలవంతంగా భుజాలువొంచి కూచోబెట్టి, ఎవ్వరూ పలక్కుండా వొట్లు వేసుకొన్నారు వాళ్ళల్లోవాళ్ళు

'వాళ్ళ నాన్నకు నా తెలివితేటలమీద అమోఘ మయిన విశ్వాసంవుంది. నేనెట్లాగైనా గోవిందాయ్‌ని ఇక్కడికి తీసుకురావాలి. నెలూరులో వాడు అదెవత్తో 'రోహిణి'ట, దాన్ని వుంచుకొని చెడిపోతున్నాట్ట, ఈ చీదరనుండి, దిగుళ్ళ నుండి, కంపునుండి విడివడి, హాయిగా, శాంతంగా ఆ 'రోహి ణి'తో జీవనానికి మెరుగు పెడుతున్న వాణ్ని బెదిరించి, అది

లించి, మోసపుద్ధి వాడిమొహను పెళ్ళాం పురిని తగిలించాలిసిన మహత్తర బాధ్యత"

'నీభుజంబులమీద నతగాడు మోపె నన్నమాట' అని పూర్తిచేశాడు పాండు.

'వాళ్ళనాన్న ఏదో అడ్రస్‌యిచ్చాడు గానీ, రైల్లో ఎక్కడో పోయింది. జ్ఞప్తికిగూడా లేదు...'

'పోనీ పేపరు ఆఫీసుకు వెళ్ళకపొయ్యావా?'

'ఎప్పుడు? రాత్రి తొమ్మిదింటికా? సాయంత్రం మూడు గంటలబండి, 'అనివార్య కారణాలవల్ల' తొమ్మిదింటికి ఆగింది నెలూరులో. అక్కడికి వెళ్ళాను ఆఫీసుకు. మూసి వుంది. ప్యూన్ని గురకనుండి లేపి అడిగితే, చేతిని వీపువెనగ్గా తిప్పి చూపించి, 'అక్కడ అడిగినారా—తప్పక సెపుతారు' అని కళ్ళుమూశాడు.

'ఏంచెయ్యను? ఎక్కడ పండుకోను? ఎవరూ తెలవదు. ఎట్లా ఈరాత్రి?'

'అన్నం తిని అట్లా హోటలు ముందు కూచుని వున్నాను...'

'ఇంతలోకే ఒకమ్మాయి మాంఛి యవ్వనంలో వున్నది కనిపించివుంటుంది. అంతేనా?' అన్నాడు రంగడు, ఈ సంభాషణ మామూలేగా అన్నట్టు గొంతుమార్చి.

'ఇది కథ కాదుగా అట్లా కనిపించటానికి. పోనీ యీ రాత్రి... అనిపించింది. గోవిందాయ్‌మీంది కోపం తగ్గుతుంది. ఈరాత్రి గడుస్తుంది గూడా. గడపటానికి ఏ హోటలులో తీసుకో వచ్చు ననుకొండి. ఊరికే ఎంతమందికి గడపటల్లేదు గనక,

అతను కనిపించకపోతే ఈవిషయం మీతో చెప్పే అవసరమే వుండివుండదు.''

'వాడెవడ్రోయ్? నిన్ను జూచి ఇక్కడున్నావేం అల్లుడూ? అంటూ ఇంటికి తీసుకుపోయి'

'నేనెంత బుద్ధిహీనుణ్ణి! నాలుగు అస్త్రోప్పి బిళ్ళలన్నా తెచ్చుకోలేదు' అన్నాడు సుందరం తల నొక్కుకొని.

'మాట్లాడితే చడ్డవొట్టు...ఇక కానివ్వరా సుందరం,' అని పెద్ద బూతువొట్టు పెట్టాడు కేశవులు.

సుందరం దగ్గి, గొంతుసరిచేసుకొని మళ్ళీప్రారభించాడు.

'వాడి వేషాన్ని బట్టి, మనం వెంటనే సంగతి గ్రహించుకొన్నాము. వాడి ఇలాకాలో అయిదారుగురు అమ్మాయిలు వున్నారట. సరే పదమన్నాను. వాడు రోడ్లన్నీ తిప్పితిప్పి...''

'...ఒకచీకటి గొందిలోనికి తీసుకెళ్ళాడు.' అనగానే వొకరు.

'ఇంకేం! ఆ తరువాతకూడా నువ్వేచెప్పు? నేనెందుకు వాగటం!'' అన్నాడు సుందరం దిగులుగా.

....

'ఆబజారంతా యిరుకే. ఇళ్ళమీదయిళ్ళు కుక్కుకొని వున్నాయి, వాడు నన్నొక పెంకుటింట్లోకి తీసుకు వెళ్ళాడు. పడ వాలో దూలానికి హరికేన్ లాంతరు. చిన్న డాయసు. రెండు మూడు ముసలికుర్చీలు. నావెంట వున్నవాడు లోపలికెళ్ళి మాట్లాడి వొచ్చాడు. కాసేపటికల్లా ఒక మనిషి వొచ్చింది లాంతరుకు దగ్గిరిగా నాకు బాగా కనిపించేట్టు...''

'ఆమె అందాన్ని చూసి భ్రమించి ఆరాత్రి ఆమెతో గడిపావు. ఏమిట్రా నీగొప్ప! ఈపని ఏ వెధవయినా చేస్తాడు. ఇదేనా మహాపాడిచి గెలిచినట్లు...' ఇట్లాఅంటూనే వున్నాడు పాండు.

'నారాత బద్దలయి ఈవిషయం మీాముందుఎత్తానురా బాబూ! చివరికంటూ వినకుండానే వ్యాఖ్యానిస్తే ఏంచేసేది నేను?' అన్నాడు సుందరం—

'కాదుటోయ్? మనవాడేదో ఘనకార్యం చేశాట్ట. తరువాతనో దేవా!'

'ఎంతఅని అడిగాను. పదిట. ఆమెనుచూశాను. ఏమంత బావుండలేదు. సన్నగా చామనచాయగా వుంది. మొఖంమీాద మచ్చలు...'తరవాత వొస్తాను' అని నేను బైటపడ్డాను వెంట నున్నవాడితో.

'ఏం? బావోలా?' అన్నాడు సంధాతకుడు.

'అట్లావుందేం? సోడాకాయముఖం అదీనూ, ఇంకా మంచివాళ్ళు దొరకరా?' అన్నాను.

'అయ్యో లేకేం! దీని బాబులాంటోళ్ళున్నారు రండి'

'దీని బాబులాంటోళ్లున్నప్పుడు దీని దగ్గిరికే పీడెందుకు తెచ్చాడో నన్ను' అర్థంకాలేదు నాకు. ఇంకో యింటికి వెళ్ళాము. కాస్త కుడియెడంగా ఇంతే! అక్కడున్న అమ్మాయి ఒక వికారపు నవ్వునవ్వింది రొమ్ములుకదిలేట్టు. దగ్గిరిగావొచ్చి చేతిలో సిగరెట్టందుకుంది.'

'ఆంగ్లోయిండియన్ కాదుగదా కొంపతీసి!'

"అబ్బే నాటుసరుకేనోయ్. ఆమె ఖరీదు వొకరాత్రికి పదిరూపాయలేనట. లైటికొచ్చాను. సంధాతకుని ముఖంమీద విసుగు నిరాశ కనిపిస్తోంది. లైటు వెలుగున అతన్ని చూచినప్పుడల్లా, ఏంచేయను? వీడి తృప్తికోసం కుళ్ళు సరుకును ఎక్కడ భరించను!"

"మరి ఆరాత్రల్లా అట్లాగే తిరుగుతున్నావా?"

"అయిదారు కొంపలు తిరిగినా నచ్చలేదు నాకు. చివరికి "ఇక్కడ వొక అమ్మాయి వొచ్చింది కొత్తగా" అన్నాడు వాడు.

"ఎక్కడికి?"

'ఇదే ఈ పక్కింటికి'

'అయితే పోయి చూద్దాం'

'కానీ...'

'అతను నసుగుతున్నాడు'

'ఏమిటి?'

తలవొంచి పలకడు.

'ఏమిటి సందేహం నీకు?'

అతను తలెత్తి

'ఆఁ ఎందుకులెండి! లాభం వుండదు.'

నాకు ఆతృత హెచ్చింది.

'ఏం? ఏమిటి కారణం?'

'అబ్బే ఎందుకూ వీలుకానిది. ఇంకోచోటికి పోదాం.'

"వొద్దు, ఆయింటికే పోవాలి."

"నావల్లకాదు. నిన్న మొన్నటి దాకా సంసారంచేస్తున్న మనిషి. భర్త అమాయకుడు. మెత్తటిమనిషి. అత్త మహాగయ్యాళి. తెగ వేధించుకు తినేదట..." అంటున్నాడు.

"దాన్ని...ఆ అత్తను బద్దలుగా, నిలువుగా చీల్చాలి" అని అరిచాను

"వహావ్వా! వాహావ్వా!! ఏం ధీరవీర ప్రదర్శనరా సుందుగా! అత్త సంగతి దేవుడెరుగు...కోడలినన్నా మరి"

"విను. రసకంథాయపు పట్టే ఇక్కడ"

అందరూ శ్రద్ధగా ముఖాలు పెట్టారు.

'అట్లాగే ఆపిల్ల మూడేళ్ళు భరించింది. అఖరికి వోర్పు తగ్గి ఈవూరొస్తే మీనాక్షి చేరదీసి కన్నబిడ్డకుమల్లే సాకుతోంది' అన్నాడు వాడు.

'అయితే చూడాలి మనం తప్పక'

'మీనాక్షి రాకాసిముండ. పైగా యామనిఅరుస్తుందో యీమాటకు. అయినా ఆపిల్ల వొప్పుకొంటుందా యిందుకు? సంసారం చేసినపిల్ల?'

'ఎట్లాగయినాసరే కుదుర్చు. నీకష్టం వుంచుకోను'

'అబ్బే అందుకాదండీ! మాట దక్కదేమోనని— పెద్దమనుషులతో పని' అని గొణుగుతున్నాడు.

'కాదు, ఎట్లాగైనాసరే! కావాలంటే రెండు రూపాయలు అదనం నువేసేలిను. నీదిమాత్రం కష్టంకాదా' అన్నాను.

'పీకమీాదకు తెచ్చుకొన్నానే' అంటూ వాడు నన్ను అరుగుమీాద కూచోబెట్టి, లోపలికెళ్ళి అరగంటకొచ్చాడు బైటికి. నాగుండె పింజంపింజం అంటోంది యేమయిందోనని.

'ఏమయింది' అన్నాను తడిఆరిన గొంతుతో.

'వాడు నవ్వి—'

'పంతులుగారు నక్కను తొక్కివొచ్చారు. మొదట్లో ఆముండ కేకవేసింది. మీారు మర్యాదస్తులనీ, పెద్దమనుషులనీ, దారితప్పివొచ్చారనీ—అన్నాను. కానీ పాతిక రూపాయలకు తక్కువ వొద్దన్నది. ఆడబ్బున్నా ఆపిల్ల గుడ్డలకేనట. యేమం టారు?' అన్నాడు.

"ఓ"

"వాడికి ఐదుయిచ్చి లోపలకెళ్ళాను. యేభయ్యేళ్ళది వేలితో గదిచూపించి పోయింది. తలుపు దగ్గరగావేసి, ఆ పిల్ల కేసి చూశాను. తలవొంచుకొని దిగులుగా కనపడ్డది. తళు కులు, బెళుకులూ లేవు. చాలా సాదాతనం ఆమె. ముగ్ధ, గొప్ప అందం."

"ఒరేయ్! కవిత్వం ఆపు. అసలు సంగతి?" అన్నాడు రంగడు.

"ఏముందీ, ఆగొప్ప అందాన్ని. ఆ మొగుడుదప్ప, నా వుద్దేశం ప్రకారం అంతవరకూ యింకెవరూ తాకని, మెత్తని, నున్నని, గుండ్రని ప్రదేశాలు. పాతిక యిచ్చాను ఉదయం పోతోపోతూ" అని నవ్వాడు సుందరం.

"ఇంతులో నీ పప్పులో కాలువెయ్యటం ఏముందీ?" అన్నాడు రంగడు.

"ఓ. అదా! ... ఉదయం, గోవిందాన్ని కలిశాను. వాడికి పెళ్ళిలోని ఆనందాన్ని చెప్పాను. పూటపూటకు దేన్నో ఒకదాన్ని దేబిరించకుండా స్టోర్‌రూం లాగా వుంటుంది భార్యంటే అన్నాను. సరే, వాడూ నేనూ అరుచుకొన్నాం కాసేపు. ఎట్టాగయితేం మెడలువిరిచి రాత్రి మెయిలుకు ప్రయాణం గెలిచాను వాడిమీద. ఏదో సరుకులకోసం సాయంత్రం అట్లా బజారుకొచ్చాం. ఆ పిల్ల—సంసారం వొదిలివచ్చిన అమాయక గృహిణి, రాత్రి పాతికరూపాయల అనుభవం అమ్మినమనిషి—ఇంకెవరితోనో బండిలో పోతున్నది.

"అరె! ఆ పిల్ల గృహిణీమణి అన్నావుకదరా మరి! ఇంకెవడితోనో అంటావేం? ఒకవేళ దాని మొగుడేమో? కనుక్కొన్నావా?" అన్నాడు పాండు—

"గోవిందాన్ని అడిగాను"

"ఎందుకు?" అన్నాడు గోవిందం.

"వూరికే నే"

"చంపకం"

"లక్ష్మమ్మకాదా?" అన్నాను ఆశ్చర్యంతో.

'నీకేం తెలుసు?'

జవాబుకోసం చచ్చాను.

'ఆమె సంసారస్త్రీకాదా? మొగుడు అక్కుపక్షి అయితే అత్తపోరు పడలేక యీవూరు రాలేదా?'

'ఎవడో నీకు టోపీపెట్టాడు' అని నవ్వాడు గోవిందం—

'అది సంసారపుదీకాదు పాడూకాదురా. ఇదొకవేషం!

ఎంతమందిని చూపించినా కాదంటున్నానని ఆ గాడిదకొడుకు యీ పన్నాగం పన్నాడు' అన్నాడు. సుందరం.

'మరి నువ్వుగూడా మొదట్లో తెగ పొగిడావేం?' అన్నాడు కేశవులు.

'ఏంచేయను? వాడు చెప్పినమాటలు నమ్మాను. ఆ దృష్టిను డిచూస్తే అట్లానే కనిపిస్తుంది.

'అది సంసారపు స్త్రీ అనగానే, నిజంగా నాకళ్ళకు అంతే అనిపించింది. వస్తుతః లేకపోవొచ్చు. కాకపోయినా మనకై మనమన్నా సృష్టించుకొంటాము అందులో చాలా మంచిస్థితిలోంచి వొచ్చిందంటే గౌరవంకదా! అదేచూశాను. వాడు—ఆదొంగవెధవ—ఇదీ మామూలు మనిషేననీ, దీని విలువగూడా పదిరూపాయలకు మించదనీ చెప్పినట్లయితే, దీన్ని గూడా కాదనేవాణ్నేమో! అందుకే వాడు, ఖరీదు పెంచి, వెరిపించాడు నన్ను' అని తలవొంచుకొన్నాడు సుందరం.